క్లుప్తంగా

డీజేలకు అనుమతి ఇవ్వాలి

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని డీజేలకు నియమ, నిబంధనలతో కూడిన అనుమతులు ఇవ్వాలని జిల్లా సౌండ్ లైటింగ్ డెకరేషన్ యూనియన్ నాయకులు కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మాట్లాడారు. తాము గత కొన్ని సంవత్సరాలుగా సౌండ్, లైటింగ్ డెకరేషన్ వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించామన్నారు. రాజకీయ పార్టీల కార్యక్రమాలు, పండుగలు, శుభకార్యాలు ఇలా ప్రతి చిన్న కార్యక్రమాలు సౌండ్ లేనిదే నడవదన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి అనవసర సౌండ్‌లతో ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్నవారికి నిబంధనలతో కూడిన అనుమతులు ఇవ్వాలన్నారు.

మున్సిపల్ అధికారులకు ఐడీ కార్డులు అందజేత

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కమిషనర్ రాజు ఐడీ కార్డులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ హయూమ్, శానిటరీ ఎస్సై గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జెన్‌కో ఉద్యోగుల నిరసన



బాల్కొండ: ఎస్సారెస్పీ వద్ద ఉన్న జల విద్యుదుత్పత్తి కేంద్రంలో పనిచేస్తున్న జెన్‌కో ఉద్యోగుల నిరసన కొనసాగుతోంది. శనివారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌లో సింగరేణిని భాగస్వామ్యం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు నినాదాలు చేశారు. జెన్‌కో ద్వారానే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి



బాల్కొండ: యాదవులు ఐక్యమత్యంతో ఉంటు రాజకీయంగా ఎదగాలని టీపీసీసీ అధికారి ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బాల్కొండ నియోజకవర్గ స్థాయి యాదవుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గతంలో కొన్ని ప్రభుత్వాలు యాదవులను రాజకీయంగా ఎదగనివ్వకుండ కుట్రలు చేశాయన్నారు. ప్రస్తుతం యాదవుల సత్తాను చాటాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల యాదవ సంఘం అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మాస పూజోత్సవం

బాల్కొండ: మండల కేంద్రంలో అయ్యప్ప ఆలయంలో శనివారం అయ్యప్ప మాస పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల 5న గణేశ్ మహరాజ్ ఆధ్వర్యంలో మాస పూజోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భగా అయ్యప్ప స్వామి 18 మెట్ల పూజ చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిమిషాంబ దేవీ ఆలయంలో..

మండల కేంద్రంలోని నిమిషాంబ దేవీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

27 నామినేషన్‌లు దాఖలు

బోధన్‌టౌన్: బోధన్ పట్టణ అభివృద్ధి కమిటీకి మొదటి రోజు శనివారం 27 నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఎన్నికల కమిటీ ప్రతినిధులు నామినేషన్లను స్వీకరించారు. పట్టణ అభివృద్ధి కమిటీ కోసం జారీ అయిన ఎన్నికల నోటిఫికేషన్‌లో భాగంగా అధ్యక్ష పదవికి 3, ప్రధాన కార్యదర్శి పదవీకి 6, కోశాధికారి పదవీకి 7, ఉపాధ్యక్ష పదవీకి 5, కార్యదర్శి పదవీకి 6 నామినేషన్‌లు దాఖలయ్యాయని ఎన్నికల కమిటీ ప్రతినిధులు పోశెట్టి, శంకర్, అంబెల్లి శంకర్, అజయ్, సాయిలు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

బోధన్‌టౌన్: లయన్స్ క్లబ్‌ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో పట్టణంలోని రైస్‌మిల్ అసోసియేషన్ భవన్‌లో ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌ఆఫ్ ఆచన్‌పల్లి కార్యదర్శి రామకృష్ణ, క్లబ్ ప్రతినిధులు గణపతిరెడ్డి, శ్రీకాంత్, సాంబిరెడ్డి, కృష్ణమోహన్, పుబ్బారావు, ప్రసాద్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు దుర్గావావు, ఎస్ అశోక్‌కుమార్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



నగరంలోని గౌతం నగర్‌లో..



నగరంలోని శ్రీనగర్ కాలనీలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రజలు

నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలు మండపాల వద్ద అన్నదానాలు ఏర్పాటు చేశారు. –సాక్షి నెట్‌వర్క్



జక్రాన్‌పల్లిలో..



ఘన్‌పూర్ గ్రామంలో..



తాళ్లరామడుగులో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు







బోర్గాం(పి)లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి.. నగరంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్.. మార్కండేయ మందిరంలో..

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- గీతకార్మికులకు కిట్ల పంపిణీ



గీత కార్మికులకు రక్షణ కవచాలను (కిట్స్) పంపిణీ చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద గల రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ (కిట్స్) కవచాలను ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ద్వారా గీత కార్మిక సంఘం వారి సహకారంతో ఈ కిట్లను పంపిణీ చేస్తున్నమన్నారు. 54 మంది అర్హులు కాగా 52 మందికి పంపిణీ చేశారు. కిట్లను గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, బీసీ కార్పొరేషన్ జిల్లా ఇన్‌చార్జి అధికారి రమేష్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్సై మల్లేష్, నాయకులు వెంకట్రాములు, లక్ష్మీనారాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బైరి మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి చేయాలి



ఇందల్వాయి: తెలంగాణలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) వ్యవస్థాపకుడు, రాష్ట్ర ట్రికర్, ఫైనాన్సియల్ చైర్మన్ బెల్లయ నాయక్‌ను శనివారం ఇందల్వాయి మండల ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు కోరారు. ఈమేరకువారు జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందించారు. నాయకులు మహిపాల్ నాయక్, మోహన్ నాయక్, శ్రీనివాస్, సుధాకర్, రమేష్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మాల ఉద్యోగులు



నిజామాబాద్‌నాగారం: పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను శనివారం జిల్లాకేంద్రంలో జిల్లా మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను సత్కరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, జిల్లా అధ్యక్షుడు స్వామిదాస్, ఆడేపు శంకర్, భూమయ్య, గంగాధర్, పద్మరావు, దేవయ్య, చిన్నయ్య, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

నిజామాబాద్ సిటీ: నగరంలోని విద్యుత్ వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే విద్యుత్ శాఖ లక్ష్యమని ఏడీఈ తోట రాజశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కేంద్రాలను శనివారం విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యుత్ పొదుపులో భాగంగా నెలవారి మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నోడల్ అధికారి అశోక్, ఎస్సీ రవీందర్, డీఈ శ్రీనివాస్‌రావు, ఏఈ గంగా శేఖర్, ఫోర్‌మెన్ రామారావు, ఎస్ఐ రామ్‌గోపాల్, లైన్‌మెన్లు సంజీవ్, రమేష్, దశరథ్, ప్రేమ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ అధికారులు

సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తాం

సిరికొండ: హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ద్వారా పేదలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అయినాల శ్రీకాంత్ అన్నారు. మండలంలోని తూంపల్లి గ్రామంలో శనివారం ఫౌండేషన్ 3వ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి, వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలో నిజామాబాద్‌లో జిల్లాస్థాయిలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను వివరించారు. సభ్యులు రవి, రాజేందర్, వినోద్, రాజు, నవీన్, ప్రశాంత్, బాలరాజ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జక్రాన్‌పల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్మూర్ డీఎల్‌పీవో కృష్ణ సూచించారు. జక్రాన్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆన్‌లైన్ అనుమతులు, రెన్యువల్స్, ట్రేడ్ లైసెన్స్, ఫాగింగ్ స్ప్రే, మంచినీటి సరఫరా తదితర అంశాలపై సమీక్షించారు. ఎంపీడీవో సతీష్ కుమార్, ఎంపీవో యూసుఫ్‌ఖాన్, ఆయా గ్రామాల కార్యదర్శులు రాజేశ్వర్, భరత్‌కుమార్, అనిల్, గంగాధర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లిలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో కృష్ణ

కొనసాగుతున్న వాటర్‌మన్లకు శిక్షణ

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయంలో వాటర్‌మన్లకు శనివారం మూడో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నరేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామంలో మంచి నీటి సమస్య తలెత్తకుండా గ్రామ మంచినీటి సహాయకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవైన సమస్యలు వస్తే వాటర్‌మన్‌లు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో అవలంబించాలన్నారు. శిక్షణలో భాగంగా మోటర్ రిపేరింగ్‌పై అవగాహన కల్పించారు. డీఈఈ గంగారాం, ఏఈ మోహన్‌రెడ్డి, చైన్‌మెన్‌లు సాయన్న, మధు, గోపి, రాజు, వాటర్‌మెన్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎన్నిక కోసం డిగ్రీ పూర్తి చేసిన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు, సిద్ధార్థ డిగ్రీ కాలేజీ చైర్మన్ రాజారాం యాదవ్ అన్రాను. పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో శనివారం పట్టభద్రుల ఓటరు నమోదు దరఖాస్తులను రాజారాం యాదవ్ విడుదల చేశారు. విద్యావంతులైన పట్టభద్రులు.. ప్రజల కోసం, విద్యార్థి, నిరుద్యోగుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న వ్యక్తులను ఎన్నుకోవాలని సూచించారు. నవంబర్ 6 వరకు అర్హులైన గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేకల కృష్ణ, జి.లింగం యాదవ్, సీవీఆర్ కాలేజ్ కరస్పాండెంట్ గిరిరాజ్, ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఓటరు నమోదు దరఖాస్తులతో రాజారాం యాదవ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

ఆర్మూర్: ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని బీజేపీ సీనియర్ నాయకుడు లోక భూపతిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆర్మూర్ పట్టణంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ పట్టణ కన్వీనర్ మిరియాల్కర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఓటు నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గతంలో ఓటు హక్కు నమోదు చేసుకున్న పట్టభద్రులు సైతం విధిగా తిరిగి తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. రెంజర్ల గంగారాం, అనిల్ కుమార్, వేణు ఉన్నారు.



ఓటు నమోదును ప్రారంభిస్తున్న భూపతిరెడ్డి

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..



నగరంలోని ఎస్ఎస్ఆర్ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు



సాక్షి నెట్‌వర్క్: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని పలు ప్రభుత్వ ప్రయివేటు కళాశాలలు, పాఠశాలల్లో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. విద్యాసంస్థల ఆవరణల్లో వాటిని ఏర్పాటు చేసి, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడారు. అనంతరం స్థానిక చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. నగరంలోని స్నేహ సొసైటీలో సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మను తయారు చేసి ఆటలు, పాటలు పాడారు. అనంతరం స్థానిక చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. పలు మండలాలు, గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.





నగరంలోని స్నేహ సొసైటీలో..



కేర్ డిగ్రీ కళాశాలలో..



నిశిత కళాశాలలో..



సత్య ఒకేషనల్ కళాశాలలో..

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	దేవర పార్ట్-1 (తెలుగు)-9.10 12.20 3.40 7.00 10.20
స్క్రీన్-2	దేవర పార్ట్-1 (తెలుగు)- 10.30; చిట్టి పొట్టి(తెలుగు)-7.30; సత్యం సుందరం(తెలుగు)- 10.10
స్క్రీన్-3	సత్యం సుందరం(తెలుగు)- 12.35 4.00 7.20 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	దేవర పార్ట్-1(తెలుగు)- 11.15 2.50 6.25 10.00
స్క్రీన్-3	మత్తువదలరా-02(తెలుగు)-12.30 3.00 6.00 9.00
స్క్రీన్ -4	సత్యం సుందరం (తెలుగు) - 11.00 2.40 6.20 10.00
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	సత్యం సుందరం (తెలుగు)
నటరాజ్	దేవర పార్ట్-1(తెలుగు)
విజయ్	దేవర పార్ట్-1(తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,500	వెండి (కిలో)	96,000
22 క్యారెట్స్	72,427		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	40	60	గాజరుగడ్డ	50	80
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	25	50
బీరకాయ	40	60	దోసకాయ	40	60
దొండకాయ	40	60	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	50	80	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	80	గోబిపువ్వు	40	60
వంకాయ	40	60	బీట్‌రూట్	45	75
పాలకూర	50	90	కరివేపాకు	50	75
మెంతికూర	60	100	చామగడ్డ	50	75
కొత్తిమీర	60	90	గోరుచిక్కుడు	40	60
పుదీనా	60	90	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

నియామకం

బోధన్: మండలంలోని అమ్దాపూర్ గ్రామానికి చెందిన సిర్ప సుదర్శన్ బీజేపీ ఎమ్మెల్సీ పట్టు భద్రుల ఎన్నికల బోధన్ మండల కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

మండలంలోని రామడుగు నుంచి గోవింద్‌పల్లి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. స్తంభంను ఇనుప నిచ్చెన సపోర్టుతో ఉంచినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభం నేలకు ఒరిగిపోవడంతో తీగలు చేతికి అందేలా ఉన్నాయని చుట్టుపక్కల రైతులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు దీనిపై దృష్టిసారించి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. – ధర్పల్లి